క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీవో ఇట్ల కిశోర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ దస్త్రాలకు సంబంధించి సురక్షిత చర్యలు చేపట్టాలని, రికార్డు రూమును పరిశీలించి, అగ్నిమాపక నిరోధక యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ చర్యలు చేపట్టాలని, ఆఫీసు పరిసరాలు పరిశీలించి, పరిసరాలు పరి శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆర్డీవో కిశోర్ వెంట డిప్యూటీ తహసీల్దార్లు పవన్, ఆనంద్, దీపక్‌రాజు తదితరులు ఉన్నారు.

ఉపాధి కల్పనే 'చేయూత' ఆశయం



చేయూత సంస్థ వ్యవస్థాపకుడు రవికుమార్‌ను సత్కరిస్తున్న శేషారెడ్డి

బోట్‌క్లబ్: తమ వద్ద ఆశ్రయం పొందుతున్న బాల బాలికల విద్యానంతరం వారందరికీ ఉద్యోగ పట్టాలు అందించి పంపడమే తమ ప్రధాన ఆశయమని చేయూత సంస్థ వ్యవస్థాపకులు ఎం.రవికుమార్ అన్నారు. రోటరీ చేయూత భవన్‌లో మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 150 మంది పిల్లలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. 45 మందికి దుస్తులు, పుస్తకాలు అందజేశారు. జిల్లా చేయూత సంస్థ అధ్యక్షురాలు సురభి శారద ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం రవికుమార్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి సత్కరించారు.

పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలి



ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్న మాజీ సర్పంచ్ రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటను కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయకుండా పంచాయతీగా కొనసాగించి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు కోరారు. గుడారిగుంటలోని నివాసం వద్ద మంగళవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించి, ఎన్నికలు జరగక ఆర్థిక సంఘ నిధులు నిలిచిపోయాని, అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ అడ్డాల దంపతులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో వృద్ధులకు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ దంపతులు మంగళవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్డాల జానకీ రమ, సత్య సాహితి, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



సూర్యారావుపేట బీచ్ వద్ద ధ్వంసం చేసేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలు, సారా

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్ వద్ద ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా సీసీ రోడ్డుపై వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, సారాను పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది మంగళవారం ధ్వంసం చేశారు. కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో 261 కేసులకు సంబంధించి రూ.9.63 లక్షల విలువైన 2170 లీటర్ల మద్యం సీసాలను జేసీబీ సహాయంతో ధ్వంసం చేసినట్టు డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఈబీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎస్‌బీ సూపరింటెండెంట్, సీఐలు పాల్గొన్నారు.

బడి భవితకు బాధ్యతగా!

- సర్కార్ స్కూళ్లలో ఎన్నికలకు వేళాయే
- నగరంలో 69 పాఠశాలలకు ఎన్నికలు
- 8న ఎన్నికలకు సమాయత్తం



సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో డీఈఓ పిల్లి రమేష్

బాలాజీచెరువు : పేరెంట్స్ కమిటీల స్థానంలో పేరుమార్చిన కూటమి ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఎస్ఎంసీ ఎన్నికలకు గత నెల 31న సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు నోటిఫికేషన్ విడుదల చేశారు. 2021 సెప్టెంబరు 22న ఏర్పాటైన పేరెంట్స్ కమిటీల కాలపరిమితి 2023 సెప్టెంబరు 21తో ముగిశాయి. పేరెంట్స్ కమిటీ కాలపరిమితి ముగియడంతో వాటి స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించనున్నారు. నగర వ్యాప్తంగా 69 పాఠశాలలు ఉండగా వీటిలో 14,960 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

నిబంధనలివీ..

1. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా ఎస్ఎంసీలు ఏర్పాటు చేయాలి.
2. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీలను ఏర్పాటు చేయాలి.
3. కమిటీ ఏర్పాటుకు 50 శాతం పేరెంట్స్/గార్డియన్స్ హాజరు కావాలి.
4. కోరం ఏర్పడడానికి సమయాన్ని పాఠశాల హెచ్ఎం నిర్ణయించవచ్చు.
5. చేతులెత్తే విధానం, నోటిమాటతో చెప్పడం ద్వారా ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరించవచ్చు.
6. ఎస్ఎంసీకి ఎన్నికైన సభ్యుల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుంది. వీరిలో ఒకరు వెనుకబడిన తరగతుల నుంచి ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ అయి ఉండాలి.
7. ఒకసారి ఎస్ఎంసీ ఏర్పడిన తర్వాత దాని రద్దు, విలీనం వరకు అధికారంలో ఉంటుంది. ఎస్ఎంసీలో సభ్యులు వారి నిబంధనల ప్రకారం పదవీ విరమణ చేస్తారు. ఎస్ఎంసీలో ఏర్పడిన ఖాళీలను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు భర్తీ చేస్తారు.
8. తహసీల్దారు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏ పరిశీలకులుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవచ్చు.
9. తల్లి, తండ్రి, సంరక్షకుడికి ఓటింగ్‌లో ప్రాధాన్యం ఇస్తారు. అయితే వీరిలో ఒకరికే ఓటు హక్కు ఉంటుంది.

ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సమాచారం ఇచ్చాం.షెడ్యూల్ ప్రకారం ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకుని పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని కోరుతున్నాము.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ జిల్లా

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	50	4,566
ప్రాథమికోన్నత	01	107
జిల్లా పరిషత్ ఉన్నత	04	1770
మున్సిపల్ ఉన్నత	14	8,517

షెడ్యూల్ ఇలా

8న ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక	7 నుంచి 1గంట వరకు
చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక	1.30 గంటలకు
ఎస్ఎంసీ ప్రమాణ స్వీకారం	2.00 గంటలకు
ఎస్ఎంసీ మొదటి సమావేశం	3–3.30 గంటలకు

తరగతికి ముగ్గురు వంతున

ఎస్ఎంసీకి సభ్యులను ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున ఎన్నుకుంటారు. వారిలో ఇద్దరు తప్పనిసరిగా మహిళలై ఉండాలి. ముగ్గురిలో కూడా ఒకరు ఎస్టీ లేదా ఎస్సీ నుంచి, రెండో వారు బలహీన వర్గాలు, మూడో వ్యక్తి జనరల్ కేటగిరి నుంచి ఎన్నిక చేయాలి. ఎస్ఎంసీకి తొలుత ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున ఎంపిక చేస్తారు. పాఠశాల యాజమాన్య కమిటీలో ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కో ఆప్టెడ్ సభ్యులను నామినేట్ చేస్తారు.

కమిటీ సభ్యుల పదవీ కాలం

పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలు. కమిటీ సభ్యుల్లో వారి పిల్లల చదువు రెండేళ్ల లోపు పూర్తైనా, లేదా పిల్లలు మధ్యలో బడి వదిలి ఇతర పాఠశాలలకు వదిలి వెళ్లిపోయినా వారి కమిటీలో పదవిని కోల్పోతారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగానే ఇవ్వాలి

- లేదంటే జరిమానా తప్పదు
- కార్పొరేషన్ కమిషనర్ భావన



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: తడి–పొడి చెత్తను వేర్వేరు గానే ఇవ్వాలని నగరపాలకపాలక సంస్థ కమిషనర్ భావన స్పష్టం చేశారు. అలా ఇవ్వకపోతే జరిమానా విధిస్తామన్నారు. మంగళవారం 12వ సర్కిల్ పరిధిలోని రామారావుపేట, త్రీలైట్ జంక్షన్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ బహుళ అంతస్తుల భవనం వద్ద తడి–పొడి చెత్తను కలిపి ఇవ్వడాన్ని గుర్తించి సదరు గృహస్తుకు జరిమానా విధించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్లను కమిషనర్ భావన మంగళవారం పరిశీలించారు. రమణయ్యపేట, డెయిరీ ఫారం, అన్నమఘాటీ, సంతచెరువు ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ లోవరాజు, ఏఈ రమేష్‌బాబు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

పోరాట యోధుడు జక్కంపూడి

- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- రామ్మోహనరావుకు ఘన నివాళులు



జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు నేను ఉన్నానంటూ భరోసానిచ్చిన మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు గొప్ప పోరాటయోధుడని వైఎస్సార్ సీపీ సిటీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ద్వారంపూడి, కొడ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ద్వారంపూడి మాట్లాడుతూ జక్కంపూడి స్ఫూర్తితో రాజకీయాల్లో కొనసాగిన తనకు ఆయనే ఆదర్శమన్నారు. దివంగత వంగవీటి రంగా, జక్కంపూడి వంటి నేతల స్ఫూర్తితో రాజకీయాల్లో ఎదిగానని, వారు అందించిన స్ఫూర్తిదాయకమైన సేవలు భావి తరాలకు ఆదర్శప్రాయమన్నారు. ముఖ్యంగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ నేనున్నానంటూ భరోసాగా నిలచిన జక్కంపూడి వంటి నేతల సేవలు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సుంకర శివప్రసన్న మాట్లాడుతూ జిల్లాలో తిరుగులేని నాయకుడిగా ఎంతో మందికి రాజకీయ భవిష్యత్ కల్పించిన జక్కంపూడి గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ప్రతి కార్యకర్త హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, రాగిరెడ్డి బన్ని, రోకళ్ల సత్యనారాయణ, ఐ.శ్రీను, జిల్లా ఐటి సెల్ చైర్మన్ కృష్ణప్రియ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందరూ తినాలి

పథకం సహాయ సంచాలకుడు నాగేశ్వరరావు



మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

కాకినాడ సిటీ: తూరంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం జిల్లా పాఠశాల మధ్యాహ్న భోజన పథక సహాయ సంచాలకుడు నాగేశ్వరరావు తనిఖీ చేశారు. వంట పదార్థాలను స్వయంగా రుచి చూసి మధ్యాహ్న భోజన పథకం అమలు విషయంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం చాలా చక్కగా అమలవుతోందని అయితే హైస్కూలు విషయంలో 40 శాతం మంది విద్యార్థులకు మించి భోజనం చేయడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం ఆవశ్యకత గురించి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు తరగతుల వారీ సమావేశం నిర్వహించి నూరు శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. కోడిగుడ్డు, చిక్కి, రాగిజావ అందరు విద్యార్థులు తీసుకునేటట్లు చూడాలన్నారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు మధ్యాహ్న భోజన పథకం విషయంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీవీఎస్ కామేశ్వరి, ఉపాధ్యాయులు తానీషా వలీబాబా, జి.వసంతరావు, బి.శరత్‌కుమార్, పి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో ఇంటి పన్నులు పెరగవు

బోట్‌క్లబ్: కాకినాడ సమీపంలోని గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమైనా ఇంటి పన్నులు పెరగవని పౌరసంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధింపు ప్రవేశపెట్టడం వల్ల నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీలు, పంచాయతీరాజ్ నుంచి వేరైన గ్రామాలకు ఇదే పద్ధతి అమలు చేయనున్న నేపథ్యంలో రూరల్ నియోజకవర్గంలో ఉన్న అర్బన్ గ్రామాల విలీనం వలన ఇంటి పన్నులు పెరుగుతాయానేది అపోహ మాత్రమేనన్నారు. 2016లో గవర్నర్ ఆర్డినెన్సు ప్రకారం 2017 కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు 8 గ్రామాల విలీనం సకాలంలో జరిపి ఉంటే స్మార్ట్ సిటీ నిధులు రూ.5 వేల కోట్లు దక్కేవన్నారు. జిల్లా కేంద్రంలో కాకినాడ నుంచి పిఠాపురం వరకు వృద్ధి చెంది గ్రేటర్ కాకినాడ 39 గ్రామాలతో మెట్రో సిటీ అయ్యే అవకాశం కలుగుతుందన్నారు. 2016లో పంచాయతీ రికార్డులు అనధికారికంగా అప్పటి కలెక్టర్ నీతూ కుమారి ప్రసాద్ వెనక్కు ఇవ్వడంతో సాంకేతిక సమస్య వల్ల 2017 ఎన్నికల్లో గ్రామాల విలీనం ప్రక్రియ ఆగిందన్నారు. దీన్ని సాకుగా చేసుకుని హైకోర్టుకు వెళ్లడం వల్ల విలీనమైన 42, 48 డివిజన్లు స్మార్ట్ సిటీ నిధులు రు.20 కోట్లతో వెచ్చించినప్పటికీ కోర్టు వ్యాజ్యం వల్ల ఆ రెండు డివిజన్‌ల్లో నగర సౌకర్యాలు లేకుండాపోయాయన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు



సదస్సులో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ శ్రీనివాసనాయక్

కరప: హెచ్ఐవీ ఉన్న వారిపట్ల వివక్ష చూపరాదని, వారి మనోభావాలు దెబ్బతినేలా ఎవరూ ప్రవర్తించరాదని డీఐఓ, మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల భీమాబాయి మహిళామండలి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లతో ఏర్పాటుచేసిన హెచ్ఐవీ చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టు ఉత్తర్వుల ద్వారా మినహా ఏ వ్యక్తి కూడా హెచ్ఐవీ స్థితిని బహిర్గతం చేయరాదన్నారు. హెచ్ఐవీ చట్టాన్ని ఉల్లంఘించేవారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా, లేదా రెండూ విధించబడతాయన్నారు. ఈవ్యాధి సోకిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి ఏఆర్‌టీ, కో ఇన్‌ఫెక్షన్ మందులు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టంగురించి విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన మండల భీమాభాయి మహిళామండలి అధ్యక్షురాలు వి.నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ, నియంత్రణ చట్టం 2017లో వచ్చిందన్నారు. ఎంఎల్‌హెచ్‌ఓలు టి.బాలాత్రిపురసుందరి, టి.రాజగోపాల్, ఎం.లక్ష్మణరావు, బి.ప్రసాద్, టి.వీరబాబు, మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి అందరూ కృషి చేయాలి



క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కాకినాడ సిటీ: ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిరోషిమా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచశాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సాంకేతికత ప్రపంచ శాంతికి ఉపయోగపడాలన్నారు. హిరోషిమా బాంబు దాడి ప్రభావాలపై అవగాహన కల్పించడానికి ఏటా ఆగస్టు 6వ తేదీన హిరోషియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో మానవ వినాశనానికి, అధిపత్యం కోసం మానవ స్వయంకృతాపరాధం వల్ల జరిగిన సంఘటనే హిరోషియాపై శక్తివంతమైన బాంబు దాడి అన్నారు. మానవ చరిత్రలో అణ్వాయుధ దాడులు జరిగినది హిరోషిమా, నాగసాకిలలో బాంబింగ్ సంఘటనల్లో మాత్రమేనన్నారు. ప్రపంచంలో ఈ దారుణ మారణకాండకు ఆగస్టు 6 నాటికి 79 సంవత్సరాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి మంగళవారం మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దుర్వ్యసనాలు–నష్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు పీఎస్ రాజు, జనవిజ్ఞాన వేదిక నేత వి.సత్యనారాయణరెడ్డి తదితరులు విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకుండా కేవలం చదువు పైనే దృష్టి పెట్టాలన్నారు. జనవిజ్ఞాన వేదిక నేత వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలను వివరిస్తు వాటిని ఎలా ఎదుర్కొనాలో వివరించారు. జనరిక్ మందులు–వాటి ఉపయోగాలు, సంఘటితంగా ఉంటే కలిగే లాభాలను వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతు పొగాకు వల్ల వాటిని ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, శ్రీకర్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు లేక జనం పస్తులు

- ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు

పిఠాపురం: గొల్లప్రోలు పట్టణ పరిధిలో కొత్తగా నిర్మించిన కాలనీవాసులకు రాకపోకలకు దారి లేక తాగునీరు, ఆహారం లేక పస్తులుంటున్నారని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ ధర్నా నిర్వహించారు. మొదటగా ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ కాలువ వద్ద ధర్నా చేసి అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ముంపు బాధితులకు తాగునీరు ఆహారం అందించి శాశ్వతంగా రాకపోకలు సాగించేలా కృషి చెయ్యాలని నినాదాలు చేశారు.

యూనియన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కుంచె అంజి బాబు మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యలు పట్టని జిల్లా అధికారులు ఎందుకని, విధులు మరచి కాలక్షేపం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించకపోతే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదన్నారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఉన్నతాధికారులు స్పందించి కాలనీ వాసుల సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, ఎన్ శంకర్, కొశిరెడ్డి గణేష్ పలువురు కాలనీ వాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలునికి గరుడ వాహనం సమర్పణ



గరుడ వాహనాన్ని ఆలయ సిబ్బందికి సమర్పిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక వేణుగోపాలస్వామి వారికి స్థానిక భక్తులు మంగళవారం సుమారు రూ.55వేల విలువైన ఇత్తడి గరుడ వాహనాన్ని సమర్పించారు. పిఠాపురానికి చెందిన లోకారెడ్డి బుచ్చిరామన్న దొర కుటుంబ సభ్యులు కేదారిశెట్టి వెంకట నాగ సూర్య గంగాధర్ రామారావు, చంద్రకన్య దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ గరుడవాహనాన్ని అర్చకులకు అందించారు. వాహన సంప్రోక్షణ అనంతరం గరుడ వాహన ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ నున్న శ్రీరాములు స్థానిక భక్తులు పాల్గొన్నారు.